విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్

కళాశాలను సందర్శిస్తున్న కలెక్టర్ జితేష్ పాటిల్

పాల్వంచ, నవంబర్ 2 : మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని నెహ్రూనగర్‌లో గల గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం విద్యార్థులకు ఆహారం, విద్యా సామగ్రి, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ అనురాధను ఆదేశించారు.

ఉపాధ్యాయులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 2 : వరంగల్ –ఖమ్మం –నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు నమోదు గడువు ఈ నెల 6వ తేదీన ముగియనున్నట్లు పేర్కొన్నారు. 2018 నవంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31వ తేదీ వరకు మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఫామ్ 19 ద్వారా దరఖాస్తు నింపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

త్వరలోనే విద్యుత్ సమస్యలు తీరుస్తాం: ఐటీడీఏ పీవో

పాలాల్లో పర్యటిస్తున్న ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: త్వరలోనే విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అన్నారు. శనివారం మండలంలోని మామిడిగుండాల గ్రామంలోని పంటలను ఫారెస్టు అధికారులు, విద్యుత్తు శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల పంట పొలాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటే ఎలాంటి ఆటంకాలు ఎదురవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు దళారులను నమ్మవద్దని, రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించాలని పీవో సూచించారు. త్వరలోనే ఫారెస్టు అధికారులతో సంప్రదించి రైతులకు కరెంటు లైన్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాష, ఎఫ్ఆర్‌వో సురేష్, విద్యుత్తు శాఖ ఏడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, నవంబర్ 2: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

పర్ణశాల షాపులకు లైసెన్సులు ఖరారు

పర్ణశాల, నవంబర్ 2: పర్ణశాల ఆలయ ప్రాంగణంలో ఉన్న షాపుల లైసెన్సు హక్కులను శనివారం భద్రాచలం సీతారామ దేవస్థానం కార్యాలయంలో బహిరంగ వేలం ద్వారా ఖరారు చేసినట్లు పర్ణశాల అధికారి అనీల్‌కుమార్ తెలిపారు. శనివారం భద్రాచలం దేవస్థానం కార్యాలయంలో 9 షాపులకు బహిరంగ వేలం నిర్వహించగా, 5 షాపుల లైసెన్సులు మాత్రమే వేలం ద్వారా లైసెన్సులు దక్కించుకున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు.

కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మణుగూరు టౌన్, నవంబర్ 2: మద్యం మత్తులో ఉన్న కొడుకు తండ్రిపై దాడి చేసి హత్యచేసిన ఘటన శనివారం మణుగూరు మండలం పగిడేరు ఎస్టీ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎస్టీ కాలనీకి చెందిన కుంజా భీమయ్య (59)కు కొడుకు కుంజా రాములు మద్య గొడవ జరిగింది. మద్యం మత్తులో కొడుకు రాములు కోపోద్రిక్తుడై కర్రతో తన తండ్రి తలపై బలంగా కొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో భీమయ్య అక్కడే పడిపోయాడు. స్థానికులు అక్కడికి చేరుకొని భీమయ్యను వెంటనే మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భీమయ్య మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం డీఎస్పీ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మణుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగొడ్డుగూడెం వద్ద రాకపోకలు బంద్

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 2: వేకువజామున ఒక గంట సేపు కురిసిన వర్షం కురిసింది. కోత దశకు వచ్చిన వరి, మినుము రైతులను వర్షం నిండా ముంచింది. మండల పరిధిలోని రామన్నగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం, మల్లాయిగూడెం, అనంతారం, గాండ్లగూడెం, నారాయణపురం, ఆసుపాక, వినాయకపురం, ఉట్లపల్లి, నారంవారిగూడెం, అచ్యుతాపురం గ్రామాల్లో గంట సేపు భారీ వర్షం కురిసింది. వర్షంతోపాటు ఈదురుగాలులకు వరి పంటలు నేలవాలాయి. వాగొడ్డుగూడెం వద్ద రాకపోకలు బంద్

మండలంలోని దమ్మపేట మండల సరిహద్దు గ్రామాల్లో కురిసిన వర్షాలకు ఉట్లపల్లి సమీపంలోని అంకమ్మచెరువుకు వరదనీరు ప్రవహించింది. నల్లబాడు వాగు ఉధృతంగా ప్రవహించి వాగొడ్డుగూడెం–అశ్వారావుపేట మధ్య రాకపోకలు నిలిచిపోయ్యాయి.

'పేట'లో భారీ వర్షం

దిబ్బగూడెంలో నేలవాలిన వరి పంట

దిబ్బగూడెంలో కురుస్తున్న వర్షం

అనంతారం, గాండ్లగూడెం, కావడిగుండ్ల, కన్నాయిగూడెం గ్రామాల ప్రయాణికులు, వాగొడ్డుగూడెం, కొత్తగంగారం, వేదాంతపురం, మీదగా ఉట్లపల్లి వైపు ఆటోల్లో ప్రయాణం సాగించారు.

సీహెచ్‌పీల సామర్థ్యం వంద మిలియన్ టన్నులకు పెంచాలి : సింగరేణి సీఎండీ బలరాం

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 2 : బొగ్గు రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(సీహెచ్‌పీ) మరింత సమర్థంగా పనిచేయాలని, ప్రస్తుతం 80 మిలియన్ టన్నులు బొగ్గు రవాణా సామర్థ్యాన్ని వంద మిలియన్ టన్నులకు చేరే దిశగా కృషి చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సీహెచ్‌పీలు, భారీ యంత్రాల పనితీరుపై సమీక్షించారు. రానున్నకాలంలో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోనుందని, సీహెచ్‌పీల సామర్థ్యాన్ని కూడా క్రమంగా పెంచాల్సి ఉందన్నారు. ప్రస్తుతం సింగరేణివ్యాప్తంగా 11 భారీ సీహెచ్‌పీలు ఉన్నాయని, వాటికి అదనంగా మరో 2 సీహెచ్‌పీలు, ఒక సైడింగ్ ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయన్నారు. 5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రామగుండం–2 ఏరియాలో జీడీకే 6 సీహెచ్‌పీని ఈ ఏడాది ప్రారంభించనున్నామన్నారు. కొత్తగూడెం వీకే వోసీ గనికి అనుబంధంగా 6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో సీహెచ్‌పీని, మందమర్రి ఏరియాలో 2 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కేకే 1 రైల్వే వార్ఫ్ లోడింగ్ సైడింగ్‌ని నిర్మించనున్నామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎంలు పాల్గొన్నారు.

90శాతం వార్షిక ఉత్పత్తి సాధించిన సింగరేణి

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 2 : సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిలో అక్టోబర్ నెలాఖరు నాటికి 90 శాతం బొగ్గు ఉత్పత్తి చేసి లక్ష్యానికి అడుగుదూరంలో ఉంది. ఈ ఏడాది అధిక వర్షపాతం, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు, సాధారణ ఎన్నికలు జరిగినప్పటికీ సీఎండీ ఎన్.బలరాం దిశానిర్దేశంతో డైరెక్టర్లు, జీఎంల చొరవతో పక్కా ప్రణాళికలో అక్టోబర్ నెలాఖరు నాటికి అనుకున్న లక్ష్యానికి చేరువలో ఉంది. డిసెంబర్ నాటికి లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 3,72,51,300 టన్నులకు గాను 3,38,43,837 టన్నులు సాధించి 90శాతంలో నిలిచింది.

అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు ప్రతిపాదనపై హర్షం

మణుగూరు టౌన్, నవంబర్ 2: సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని జీఎం కార్యాలయాల ప్రాంగణాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటుపై ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర కమిషన్ ప్రతిపాదన చేయడంపై మణుగూరు ఏరియా ఎస్సీ,ఎస్టీ బ్రాంచి (1630/1982) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మణుగూరులో అంబేద్కర్ విగ్రహానికి శనివారం నాయకులు రాజలింగు, మేకల ఈశ్వర్, పీక శంకర్, కాసర్ల అనీల్, రత్నం, మునిగెల రమేష్, కోట, బల్ల సందీప్, నిట్ట జీవరత్నం హర్షం వ్యక్తం చేస్తూ పూలమాల వేశారు.

ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: చదరంగం(చెస్) ఆటతో మేధాశక్తి పెరుగుతుందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. శనివారం 21 ఫిట్ ఏరియాలోని వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మేధాశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం చెస్‌లో ఉంటాయన్నారు. కార్యక్రమంలో బొల్లం వెంకటేశ్వర్లు, జీవీ మోహన్‌రావు, జాన్ వెస్లి, రమేష్‌సింగ్, అన్వర్, నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

కొత్తగూడెం క్రైం, నవంబర్ 2 : నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకారం అందించే హోంగార్డుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు అన్నారు. హోంగార్డ్స్ అసోసియేషన్ సభ్యులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్పీని శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగపరంగా, వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యానారాయణ, హోంగార్డ్స్ ఆర్ఐ నర్సింహారావు, హోంగార్డ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఖబరస్థాన్‌లో సౌకర్యాలు కల్పించాలి

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: మండల పరిధిలోని సీఎస్‌పీ వద్ద ఉన్న ముస్లిం మైనార్టీల ఖబరస్థాన్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం సందర్శించారు. ఖబరస్థాన్‌లో ప్రహరీ, నీళ్ళ సదుపాయం కల్పించాలని ముస్లింలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తనవంతు సహకారాలు అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ముస్లిం మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మోరంపల్లిబంజర్ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు

బూర్గంపహాడ్, నవంబర్ 2: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఒక్కరోజే ముగ్గురికి సాధారణ కాన్పులు జరిగాయి. లక్ష్మీపురం నుంచి ఈ.విశ్వరూప(రెండవ ప్రసవం), ఒడియాక్యాంప్‌కు చెందిన నాగ మిల్కి(మూడవ ప్రసవం), బత్తులనగర్ నుంచి రజిత(రెండవ ప్రసవం)కు పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మిసాహితీ ఆధ్వర్యంలో సాధారణ ప్రసవాలు చేశారు.

ఘనంగా సమాధుల పండుగ

ఆళ్ళపల్లి, నవంబర్ 2: మండల కేంద్రంలోని సకల ఆత్మల సమాధుల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆళ్ళపల్లి ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకుబ్, సీఎస్ఐ చర్చి రెవరెండ్ పాస్టర్ గజ్జర్లపుడి ఏసుపాదం జయమని పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: మండల పరిధిలోని 21 ఫిట్ ఏరియా, సీఎస్ఐ చర్చి, సత్యనారాయణపురంలో కుటుంబసభ్యులతో కలిసి తమ బంధువుల సమాధుల వద్దకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం సమాధుల వద్ద కొవ్వొత్తులను వెలిగించారు.

రామవరం, నవంబర్ 2 : కార్మిక ప్రాంతంలో క్రైస్తవులు పరిశుద్ధాత్మ దినోత్సవం సందర్భంగా సమాధుల దగ్గర శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

టేకులపల్లి, నవంబర్ 2: మండలంలో పలు గ్రామాల్లో క్రైస్తవులు సమాధుల పండుగ వేడుకలు నిర్వహించారు. శనివారం నవంబర్ 2వ తేదీ సమాధుల పండుగ సందర్భంగా ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అగస్టీన్, సీఎస్ఐ చర్చి పాస్టర్ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో వేర్వేరుగా సులానగర్, కోయగూడెం, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు, మాలపల్లి గ్రామాల్లో చనిపోయిన వారి ఆత్మల శాంతి కోసం సమాధుల వద్దకు వెళ్ళి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

'ఆలపాటి'ని పరామర్శించిన 'సండ్ర'

అశ్వారావుపేట, నవంబర్ 2: సీనియర్ రాజకీయ నాయకుడు ఆలపాటి రామ్మోహనరావు (రాము)ను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందిన తర్వాత ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 'ఆలపాటి'ని శనివారం కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఆలపాటి కుమారుడు విజయ్ మోహన్, సీపీఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, దయాకర్, ఈడా గోపీ తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం : ఎమ్మెల్యే కూనంనేని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొత్తగూడెం టౌన్, నవంబర్ 2 : సుజాతనగర్ మండలంలోని డేగలమడుగులో ఉన్న జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ మెంబర్ నాగ సీతారాములు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, సీపీఐ నాయకులు, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

వందేళ్ల ఉత్సవాలకు సిద్ధం కావాలి

పాల్వంచ, నవంబర్ 2 : భారత కమ్యూనిస్టు పార్టీది వందేళ్ల సుదీర్ఘ చరిత్ర అని, ఈ చరిత్రను ప్రజలకు వివరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ సీఆర్ భవన్‌లో శనివారం జరిగిన జిల్లాస్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, నవంబర్ 2: మండల పరిధిలోని తూరుబాక, బండారుగూడెం గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధించి ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రాష్ట్ర అటవీ అభివృద్ధిశాఖ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి శనివారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివిధ శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు తీసుకునే చర్యలపై ఆరా తీశారు. సమావేశంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎండీవో ఈదయ్య పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరం

భద్రాచలం, నవంబర్ 2: భద్రాచలం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్‌క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ యూఎస్ఏ సహకారంతో ఉచిత నేత్ర శస్త్రచికిత్సా శిబిరం కార్యక్రమ వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

పినపాక,(కరకగూడెం) నవంబర్ 2: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం కరకగూడెం మండలంలోని పోట్లపల్లి, మల్లారం గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే కోరం

చెక్కులు పంపిణీ చేస్తున్న కోరం కనకయ్య

ఇల్లందు, నవంబర్ 2: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

నేడు ఇల్లెందు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

నేడు(ఆదివారం)ఇల్లెందు మార్కెట్ యార్డులు నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగనున్నదని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వరరావు, రాందాస్‌నాయక్ హాజరవుతారని తెలిపారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

జూలూరుపాడు, నవంబర్ 2 : మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తహసీల్దార్ స్వాతిబిందుకి వినతిపత్రం అందించారు. శనివారం ఆమె కార్యాలయంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు.

దివ్యాంగుడి కుటుంబానికి చేయూత

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 2 : మున్సిపాలిటీ పరిధిలోని రామవరం వన్నందాస్‌గడ్డలో నివసిస్తున్న దివ్యాంగుడు ఆకునూరి దుర్గారావు తల్లి కుటుంబానికి ఓ దాత తన తల్లి జ్ఞాపకార్థంగా బియ్యం, నెలకు సరిపడా సరుకులు అందించారు. వాటిని మునిగడప వెంకన్న చేతుల మీదుగా అందించారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

పాల్వంచ, నవంబర్ 2 : పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో ఆర్థోపెడిక్ డాక్టర్ శైలేష్ సిబ్బంది ఆధ్వర్యంలో కాలు చీలమండకు శనివారం అరుదైన ఆపరేషన్ చేశారు. ఇంప్లాంట్స్(రాడ్స్) రిమూవల్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సీ అవసరం లేని ఇంప్లాంట్ రిమూవల్ కేసులు ఇక నుంచి ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తామని డాక్టర్ శైలేష్ తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న కొత్త పరికరాలు, సాధనాలతో శనివారం సౌందర్య అనే మహిళ కుడికాలు ప్లాంట్స్ రిమూవ్ చేశామని, మరిన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిన కలెక్టర్, డీసీహెచ్‌ఎస్ రవికుమార్, మెడికల్ సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంవో సోమరాజుదొరకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో యువకుల ప్రతిభ

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 2 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం యువకులు ప్రతిభ చాటారు. శనివారం హైదరాబాద్‌లోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం యువకులు ఐదు పతకాలు సాధించారు. నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న కొట్టె సాయి శ్రీవాత్సవ్ మూడు కాంస్య పతకాలు, బండారి నాగచైతన్య రెండు కాంస్య పతకాలు సాధించారు. సాయిశ్రీవాత్సవ్ 50 మీటర్లు ఫ్రీ స్టైయిల్, 50 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్, 200 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్‌లో పతకాలు సాధించారు. నవభారత్ పబ్లిక్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీ రెడ్డి, స్విమ్మింగ్ కోచ్‌లు హనుమంతరాజు, సామ్యూల్, సంధ్యసామంత్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థుల సమర్థ్యాలను పెంపొందించాలి

అశ్వారావుపేట టౌన్, 2: సిలబస్‌కు అనుగుణంగా పాఠాలు బోధించాలని ఎంఈవో ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీ, బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు ఉన్నారు.

భూ వివాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

చండ్రుగొండ, నవంబర్ 2: భూ వివాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. రావికంపాడు పంచాయతీ దుబ్బతండాకు చెందిన బానోత్ బాలు, భార్య లక్ష్మి, కొంతమంది కూలీలతో కలిసి శనివారం పత్తి చేనులో పత్తి తీస్తున్నారు. ఇదే గ్రామానికి భూక్యా సురేష్, బీముడు, జ్యోతి, శాంతి అనే నలుగురు వ్యక్తులు (బాలు–లక్ష్మి)పై దాడి చేశారు. ఈ దాడిలో భార్యాభర్తలైన బాలు, లక్ష్మికు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చండ్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

ఇసుక అక్రమ నిల్వలపై అధికారుల కొరడా

ములకలపల్లి, నవంబర్ 2: ఇసుక అక్రమ నిల్వలపై అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని వేముకుంట సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను శనివారం అధికారులు తనిఖీ చేయగా రెండు లారీల ఇసుకను గుర్తించి స్వాధీన పర్చుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఆర్ఐ భద్రు తనిఖీల్లో పాల్గొని అక్రమ నిల్వలను గుర్తించారు. అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామస్తులతో మమేకం కావాలి

ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారే

దమ్మపేట, నవంబర్ 2: విద్యార్థులు గ్రామస్తులతో మమేకం కావాలని... వారి స్థితిగతులు తెలుసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని మల్లారం రైతువేదికలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో గ్రామస్తుల్లో చైతన్యం నింపేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వారం రోజుల పాటు గ్రామస్థులు, రైతులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యార్థులు వ్యవసాయ అనుబంధంగా రూపొందించిన ప్రత్యేక స్టాళ్లను జారె పరిశీలించి అభినందించారు. శిబిరంలో ఏడీఏ పి.రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ వై.రాఘవరావు, ఎన్ఎస్ఎస్ బృందంలో డాక్టర్లు ఎం.రాంప్రసాద్, రెడ్డిప్రియ, శ్రావణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవో దీప్తి, కళాశాల అధ్యాపకులు కె.శిరీష, రమేష్, కోటేశ్వర, కృష్ణతేజ, పావని, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 2: విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో